క్లుప్తంగా

నేడు దివ్యాంగ పింఛన్లపై విచారణ

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో వివిధ దీర్ఘకాలిక, ఆర్థో, డయాలసిస్ వ్యాధులతో బాధపడుతూ మంచానికి పరిమితమైన లబ్ధిదారుల పింఛన్లపై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు గురువారం తెలిపారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదు గ్రామ సచివాయాల పరిధిలో 14 మంది, కలుగొట్ల గ్రామ సచివాలయ పరిధిలో ముగ్గురు, రేవనూరులో ఇద్దరు, బిజనవేముల, సౌదరదిన్నె గ్రామ సచివాలయాల పరిధిలో ఒక్కొక్కరు చొప్పున ప్రతి నెల రూ. 15 వేల పింఛన్ తీసుకుంటున్నారన్నారు. వీరంతా అర్హులేనా కాదా అన్న దానిపై డాక్టర్ల బృందం విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

గోకులాలను సద్వినియోగం చేసుకోండి

బనగానపల్లె రూరల్: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గోకులం పథకం కింద నిర్మిస్తున్న పశువుల షెడ్లను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మండలంలోని నందవరం గ్రామంలో రూ.2.30లక్షలతో నిర్మించిన పశువుల షెడ్డును శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చిన్నసన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీతో గోకులం షెడ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈసీ మక్బుల్, టీఏ షబ్బీర్, వెంగన్న రాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

కోవెలకుంట్ల: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పట్టణంలోని వాసవీ బొమ్మడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలలో గురువారం జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో హీటిరో ల్యాబ్, ఆస్ట్రోటెక్ స్టీల్, ఏపీటీయూఎఫ్ వాల్యా హెచ్ఎఫ్‌సీ ఇండియా లిమిటెడ్, సన్‌కిసాన్ అగ్రీ అండ్ కో కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఎంఎల్‌టీ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 97059 98057, 86886 51650 నంబర్లకు సంప్రదించాలన్నారు.

షాదీఖానా నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణ పనులను గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోటి నిధులతో పూర్తి చేసేందుకు భూమిపూజ చేశారు.రాబోయే 9 నెలల కాలంలో షాదీఖానా భవన నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సహకారంలో నిధులు మంజూరయ్యాయన్నారు.

అదుపు తప్పి ట్రాలీ ఆటో బోల్తా



బేతంచెర్ల : మండల పరిధిలోని గోరుమాను కొండ సమీపాన కర్నూలు నుంచి బేతంచెర్ల వైపు వస్తున్న ట్రాలీ ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న టమాట తోటలో బోల్తాపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బనగానపల్లెకు చెందిన ఆటో కర్నూలు నుంచి ఖాళీగా వెళ్తుండగా ఆటో నడుపుతున్న యజమాని కునుకు తీయడంతో అదుపు తప్పి బోల్తా పడిందిదని తోట యజమాని రఘు తెలిపాడు. ఆటోలో ఉన్న ఎవరికీ గాయాలు కాలేదు.

బొలేరో ఢీకొని వృద్ధురాలికి గాయాలు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని వీసీ కాలనీలో ఓబొలేరో వాహనం ఢీకొని గురువారం వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వీసీ కాలనీలో గుర్తుతెలియని నలుగురు యువకులు మద్యం సేవించి బొలేరో వాహనం వేగంగా నడుపుతూ హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి ఓ ఇంట్లోకి దూసుకుపోయింది. దీంతో ఇంట్లో ఉన్న సుశీలమ్మ అనే వృద్ధురాలి తలకు బలమైన గాయమైంది. స్థానికులు గుంపులుగా చేరడంతో మద్యం మత్తులో ఉన్న యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన సుశీలమ్మను స్థానిక జీజీహెచ్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్లలో రైల్వే విద్యుత్ డబుల్ లైన్



రైల్వే స్టేషన్‌లో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి



సిమెంట్ నగర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి

రైల్వే స్టేషన్‌కు ఆధునిక శోభ

- బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ
- డబుల్‌లైన్, విద్యుదీకరణ పూర్తి
- ఫుట్ ఓవర్ బ్రిడ్జి, నూతన నిర్మాణాలతో ఆకర్షణీయంగా స్టేషన్
- రానున్న రోజుల్లో జంక్షన్‌గా మారే అవకాశం



బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ నూతన రైల్వే స్టేషన్

బేతంచెర్ల: డోన్ నుంచి మల్కాపురం, ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల, బుగ్గన్నపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరణ, విద్యుత్ డబుల్ లైన్ పనులు పూర్తికావడంతో రైల్వే స్టేషన్లు నూతన శోభను సంతరించుకున్నాయి. మండలపరిధిలోని బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరించడంతో ఆకర్షణీయంగా మారింది. రైల్వే స్టేషన్‌లో నూతనంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు స్టేషన్ భవనాన్ని నూతనంగా నిర్మించారు. ప్రస్తుతం బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ నుంచి క్రిష్ణమ్మ కొన రైల్వే స్టేషన్ మీదుగా పాణ్యం రైల్వే స్టేషన్ వరకు 19.035 కిలోమీటర్ల మేర విద్యుత్ డబుల్ లైన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. దీంతో గత నెల 27వ తేదీన సికింద్రాబాద్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, గుంతకల్ డీఆర్ఎం విజయకుమార్ తనిఖీ చేసి రైళ్ల రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో నూతన ట్రాక్‌లపై రైలు బండ్లు పరుగు పెడుతున్నాయి. సిమెంట్ నగర్ గ్రామంలో రైల్వే విద్యుత్ డబుల్ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా సిమెంట్ ఫ్యాక్టరీలోకి వెళ్లే వాహనాలతో పాటు కందికాయపల్లె గ్రామస్తుల సౌకర్యార్థం ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. రానున్న రోజుల్లో కర్నూలు సమీపాన ఉన్న దూపాడు నుంచి ఓర్వకల్లు మండలం మీదుగా బేతంచెర్ల మండలంలోని బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ వరకు 43 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణ పనులు చేపట్టడానికి రైల్వే అధికారులు సర్వే పూర్తి చేశారు. దీంతో రానున్న రోజుల్లో బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ జంక్షన్‌గా మారనుంది.

శుభకార్యంలో మాజీ ఎమ్మెల్యేలు



వరుడితో మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అబ్దుల్‌ఫైజ్ కుమారుడు అబ్దుల్‌ఉబేద్ వివాహ వేడుకల్లో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపల్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

రుద్రవరం: మండలంలోని హరినగరం సమీపంలో బుధవారం రాత్రి రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరు పోలీసులు, మరో యువకుడు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి అహోబిలంలో పార్వేట ఉత్సవాలు మొదలయ్యాయి. కార్యక్రమానికి బందోబస్తుగా దొర్నిపాడు పోలీస్ స్టేషన్‌ను చెందిన సిబ్బంది కొందరు వెళ్లారు. కార్యక్రమం ముగియడంతో కానిస్టేళ్లు చిన్న మాధవ, రాముడు ఇంటికి తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో రుద్రవరం నుంచి రమణ, ఇమాం,హుశేన్‌బాషా అనే ముగ్గురు మోటర్ సైకిల్‌పై పార్వేట ఉత్సవాలు తిలకించేందుకు వెళ్తున్నారు. రెండు బైక్‌లు హరినగరం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో చిన్న మధు అనే పోలీస్‌కు తీవ్రగాయాలు కాగా, మరో పోలీస్ రమణ, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.



యాగంటి క్షేత్రం చేరుకున్న శ్రీ శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు

ముగిసిన పారువేట

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీ ఉమామహేశ్వరస్వామి పారువేట ఉత్సవాలు గురువారం సాయంత్రం ముగిశాయి. ఉదయం యాగంటిపల్లె నుంచి బయల్దేరిన శ్రీ శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు పాతపాడు మీదుగా గ్రామోత్సవంగా యాగంటి క్షేత్రానికి చేరుకోవడంతో పారువేట ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యాసంవత్సరాలను పరిగణనలోనికి తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్) : ఉపాధ్యాయ బదిలీల్లో విద్యా సంవత్సరాలను పరిగణలోకి తీసుకోవాలని నంద్యాల జిల్లా ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా కొనసాగించాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్‌క స్వీనర్ బాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జాకీర్ ఉశేన్, వెంకటరామిరెడ్డి, మధు పాల్గొన్నారు.

లారీ యజమానుల నిరసన



అశోక్ లేలాండ్ గ్యారేజ్ ముందు నిరసన తెలుపుతున్న లారీ యజమానులు

బేతంచెర్ల : పట్టణానికి సమీపాన ఉన్న అశోక్ లేలాండ్ గ్యారెజ్ ఎదురుగా బేతంచెర్ల లారీ యజమానులు గురువారం నిరసన తెలిపారు. మండలపరిధిలోని బలపాలపల్లె గ్రామానికి చెందిన బెల్లం ప్రసాద్ రెడ్డి అశోక్ లైలాండ్ కంపెనీలో లారీ కొనుగోలు చేశాడు. గతేడాది నవంబర్ 30న మరమ్మతులకు గురవ్వడంతో వారంటి ఉండటంతో గ్యారేజ్‌లో లారీని ఉంచాడు. కానీ స్పేర్ట్ పార్ట్స్ తెప్పించకుండా కంపెనీ గ్యారెజ్ నిర్వాహకులు నిర్లక్ష్యం చేశారు. చివరకు గురువారం లారీ మరమ్మతులకు సంబంధించి రూ.1,50,000 అవసరమైన స్పేర్ పార్ట్స్‌ను లారీ యజమాని తెప్పించాడు. అయినా తమ కంపెనీకి సంబంధించిన డెఫ్ అయిల్ వాడలేదని, బయటి అయిల్ వాడరని అందుచేత మరమ్మతులు చేపట్టమని గ్యారెజ్ సిబ్బంది తెలిపారు. వారంటీ ఉన్నా లారీకి మరమ్మతులు ఎందుకు చేపట్టరని లారీ యజమానులు అశోక్ లేలాండ్ గ్యారేజ్ ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో లారీ యజమానులు నాగేశ్, నాగేంద్ర, శ్రీనివాసులు ఆచారి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



మాట్లాడుతున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతునాయక్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ తిరుపతయ్య అధ్యక్షతన రోడ్డు భద్రత్రా మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐతో పాటు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో శిక్షణ పొందిన డ్రైవర్లు బస్సులను నడుపుతూ ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నారన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు రోడ్డుభద్రత మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్, ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు శివరాం, డీడీగిరి, నరసింహ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నాటుసారాపై టాస్క్‌ఫోర్స్ దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా, మోటార్ సైకిల్

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కొలిమిగుండ్ల మండలం కొండమనాయుని పల్లి నుంచి తుమ్మల పెంటకు మోటర్ సైకిల్‌పై నాటుసారా తరలిస్తున్న రమేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.అతని వద్ద 60లీటర్ల నాటుసారా, మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి, నిందితుడిని బనగానపల్లె ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అప్పగించినట్లు వెల్లడించారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది రూప్‌సింగ్, బత్తుల నాగరాజు, ఓబులేసు, నాగరాజు, కృష్ణయ్య, పాములేటి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

డోన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్‌ను ఉద్దేశ పూర్వకంగా హత్య చేసేందుకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్యవైశ్యులు గురువారం డోన్ డీఎస్పీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. స్థానిక అమ్మవారిశాల వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి డీఎస్పీ కార్యాలయం వద్ద చేరుకొని ఆయనకు వినతిపత్రం అందజేశారు. హత్యా ప్రయత్నం కేసులో ఎంతటి పెద్ద వ్యక్తుల ప్రమేయం ఉన్నా చట్ట ప్రకారం గుర్తించి అరెస్టు చేయాలని కోరారు. ర్యాలీలో సంఘం నాయకులు సీఎం శ్రీనివాసులు, కోట్రికె ఫణిరాజ్, ఎస్ఎల్ మధు, రంగయ్య, సంగాల వెంకు, జీవన్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: బ్యాంకు ఖాతారులనే సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారని, ఖాతాలు ఖాళీ చేస్తున్నందున వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి పాన్, ఆధార్, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నంబర్,ఓటీపీ వంటి వాటిని అడిగితే చెప్పవద్దన్నారు. అలాగే జిరాక్సు సెంటర్ల వద్దకు అవసరం నిమిత్తం వెళ్లినప్పుడు మీరు ఎన్ని తీయించుకుంటున్నారో లెక్క పెట్టుకోవాలన్నారు. లేదంటే అదనంగా జిరాక్సు కాపీలను తీసుకొని మీ డేటా తీసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని తెలిపారు. పెద్దలు చిన్నారులకు వాహనాలు చేస్తే చర్యలు తప్పవని, మద్యం, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొమ్మలసత్రం: నంద్యాల మండలం కానాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో జనార్ధన్‌రెడ్డి (50) గురువారం మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడు మండలం ఎం. చింతకుంట్ల గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డి నంద్యాల పట్టణానికి పని నిమిత్తం బైక్‌పై బయలుదేరాడు. కానాల శివారులో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ప్రమాదంలో జనార్ధన్‌రెడ్డి తలకు బలమైన గాయం కావటంతో అక్కడిక్కడే కుప్పకూలాడు. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు నిబంధనలతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఎంవీఐ క్రాంతికుమార్

డోన్ టౌన్ : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం వలన ప్రమాద రహిత సమాజం నిర్మించవచ్చని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండెక్టర్లతో పాటు సిబ్బందికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తరచూ రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణాలు డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ, రోడ్డు నియమాలను పాటించక పోవడం వలనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా డ్రైవర్లు రాత్రి పూట నిద్ర వచ్చే సమయంలో వాహనాలను నడపకూడదని, తెల్లవారు జామున నిద్రమత్తులో ప్రయాణాలు సాగించకూడదని సూచించారు. టూ వీలర్ వాహన చోదకులు తలకు హెల్మెట్ లేకపోవడంతో ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. రోడ్డు భద్రతానియమాలపై ఫిబ్రవరి 15వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శశిభూషణ్, సీనియర్ ట్రాఫిక్ సూపర్‌వైజర్ మోజెస్, గ్యారేజ్ ఇన్‌చార్జ్ పుల్లయ్య, పాటు కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

గనులు, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలను అరికట్టాలి



డీఎస్పీ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

డోన్ టౌన్ : నియమాలను పాటించకుండా చేపడుతున్న మైనింగ్, ఫ్యాక్టరీలలో జరుగుతున్న కార్మికుల మరణాలపై విచారణ చేపట్టి, ప్రమాదాలను అరికట్టాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయకులు కోరారు. గురువారం డీఎస్పీ శ్రీనివాసులుకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామంలో కార్మికుడు మైనింగ్ క్వారీలో చనిపోయాడని, అదే గ్రామంలో 8 సంవత్సరాల కిందట మైనింగ్ క్వారీలో మట్టి పెళ్లలు విరిగి పడి హుస్సేనాపురం గ్రామానికి చెందిన ఏడుగురు చనిపోయారని తెలిపారు. అదే విధంగా చిన్న మల్కాపురంతో పాటు గత కొద్ది రోజుల క్రితం డోన్ సమీపంలోని కోట్లవారి పల్లెలోని పౌడర్ ఫ్యాక్టరీలోని పౌడర్ బంకర్‌లో పడి ధర్మారం గ్రామానికి చెందిన మహిళా కార్మికులరాలు మృతి చెందిందని గుర్తు చేశారు. ఇన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా నిబంధనలు పాటించని యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, అక్రమ మైనింగ్‌లను అరికట్టాల్సిన వారు మిన్నకుండిపోతున్నారని ఆరోపించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు పెద్ద మనుషుల పంచాయతీలు చేసి ప్రాణాలకు రేటు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం లేబర్ యాక్ట్ కూడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. పోలీసు శాఖ అధికారులైనా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి చందు, నాయకులు లక్ష్మన్న, రవి తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి



ఆలయానికి వెళ్లే మార్గంలో నిర్మించిన బ్రిడ్జి

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని పురాతన గుండం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల పట్టాభిరామాలయాన్ని నిర్మించారు. అయితే ఆంజనేయస్వామి ఆలయం నుంచి చెంతనే ఉన్న పట్టాభిరామాలయానికి చేరుకునేందుకు మధ్యలో అగాధం ఉండటంతో పెన్నాసిమెంట్(అదానీ) వారి సహకారంతో రూ.20 లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. దిగువ నుంచి భారీసైజులో పిల్లర్లు వేసి పైన రైలు కమ్మీలు ఏర్పాటు చేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణంతో భక్తులకు రాక పోకలు సాగించేందుకు సులభతరం కానుంది.

వాహనదారులకు అవగాహన కల్పించాలి



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో వాహన చోదకులను భాగస్వాములు చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలు, ఫ్లెక్సీని కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాలలో జాతీయ, రాష్ట్ర రహదారులకు సంబంధించిన బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్‌ను ప్రాముఖ్యతను వివరించడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించి ప్రమాదాలు నివారణకు కృషిచేయాలని సూచించారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : సంక్రాంతి పండుగ అనంతరం ఆయా గ్రామాల్లో అమ్మవార్లకు పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ, సుద్దమల్ల గ్రామాల్లో వెలసిన లక్ష్మీదేవి,మారెమ్మ, గంగమ్మ, చౌడేశ్వరీదేవిలకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.